ఫైర్ స్టేషన్‌కు సొంత భవనం ఏదీ?

- బాల్కొండకు ఏడాదిక్రితం మంజూరు
- ఐకేపీ భవనంలో నిర్వహణ
- ఇప్పటికీ నిర్మించని నూతన భవనం



షెడ్డు లేక ఎండలోనే ఉన్న ఫైర్‌ఇంజిన్ వాహనం



బాల్కొండలో ఇరుకు గదిలో కొనసాగుతున్న ఫైర్ స్టేషన్ కార్యాలయం

బాల్కొండ: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫైర్ స్టేషన్‌కు సొంత భవనం లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది అక్టోబర్‌లో నూతనంగా ఫైర్ స్టేషన్‌ను బాల్కొండ ప్రారంభించారు. కార్యాలయాన్ని గతంలో ఐకేపీ కార్యాలయం నిర్వహించిన ఇరుకు గదిలో ఏర్పాటు చేశారు. ఏడాది నుంచి ఆ గదిలోనే కార్యాలయం నిర్వహిస్తున్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు సంభవించిన వెంటనే మంటలు ఆర్పేసే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ఈ ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు.

స్థలం కేటాయించినా..

ఫైర్ స్టేషన్ కార్యాలయ నిర్మాణం కోసం జాతీయ రహదారి 44 పక్కన బండరాళ్లతో కూడిన స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. 20 గుంటల స్థలాన్ని ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించింది. కానీ నిధులు లేకపోవడంతో ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. స్థలం సైతం బండరాళ్లతో కూడిన స్థలాన్ని ఇవ్వడంతో చదును చేయుటకు రూ.లక్షల్లో ఖర్చు అయ్యే పరిస్థితి ఉంది.

ఫైరింజన్‌కు నీడ కరువు..

మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ప్రారంభం కోసం నూతన ఫైర్ ఇంజన్‌ను తీసుకువచ్చారు. అంతే రెండు రోజులు గడవకముందే కొత్త ఫైరింజన్ స్థానంలో నిర్మల్ జిల్లాకేంద్రం నుంచి పాడుబడ్డ ఫైరింజన్‌ను తీసుకువచ్చి పెట్టారు. ఆ ఫైరింజన్‌కు ఎన్నో మరమ్మతులు చేపట్ట వలిసి ఉంది. ఫైర్‌స్టేషన్‌లో సిబ్బంది ఉన్నా.. ఫైరింజన్ సరిగా లేకపోతే చేసేదేమి ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నారు. ఫైరింజన్ భద్రపరుచుట కోసం కనీసం రేకుల షెడ్డు కూడ దిక్కు లేదు. దీంతో ఎండకు ఎండుతుంది. వానాకు తడుస్తుండటంతో ఫైరింజన్ దెబ్బతినే ప్రమాదం ఉందని సిబ్బంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఫైర్ స్టేషన్‌కు నూతన ఫైరింజన్ మంజూరైనట్లు అధికారులు తెలుపుతున్నారు. కానీ ఇప్పటి వరకు స్టేషన్‌కు రాలేదు. ఎప్పుడు వస్తుందో కూడ తెలియని పరిస్థితి ఉంది. ఉన్నత అధికారులు, పాలకులు స్పందించి వెంటనే నూతన ఫైరింజన్ వచ్చేలా, కార్యాలయానికి పక్కా భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

ఫైర్‌స్టేషన్‌లో ఉన్న ఫైరింజన్ గురించి ఉన్నత అధికారులకు తెలియ జేశాం. బాల్కొండకు నూతన వాహనం మంజూరైంది. నెల రోజుల్లో వచ్చే అవకాశం ఉంది. భవనం గురించి ఉన్నత అధికారులకు విన్నవించాం.

– శేఖర్, ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి అధికారి, బాల్కొండ

నేడు బోధన్‌లో ట్రాఫిక్ ఆంక్షలు



శ్రీనివాస్, ఏసీపీ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణం తోపాటు డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ముందుగా డివిజన్ ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, రాంగ్‌రూట్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్ చేయరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని వెల్లడించారు. ప్రజలు సంతోషంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలన్నారు.

మద్యం తాగి తిరిగితే చర్యలు

రుద్రూర్: నూతన సంవత్సర వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని ఎస్సై సాయన్న సూచించారు. సోమవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. రాత్రి వేళ మద్యం తాగి తిరిగినా, న్యూసెన్స్ సృష్టించినా, డీజేలు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతమైన వాతవరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి



ఆర్మూర్‌లో కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



బోధన్‌లో..

ఆర్మూర్‌టౌన్/బోధన్: ఇటీవల పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, వెంటనే కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు.ఈమేరకు ఆర్మూర్‌లో సోమవారం వారు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వానికి అన్ని వర్గాల వారు బుద్ధి చెబుతారన్నారు. అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని మాదిగ జేఏసీ జిల్లా ఇన్‌చార్జి మోతె భూమన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బోధన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన చేపట్టారు. అమిత్‌షా వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లో గల మైనారిటీ గురుకుల పాఠశాలను మున్సిపల్ కమిషనర్ రాజు సోమవారం తనిఖీ చేశారు. నూతన డైట్ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో పది జీపీఏ సాధించడానికి కృషి చేయాలని సూచించారు. సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

93శాతం సర్వే పూర్తి



ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 93శాతం పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. పట్టణంలోని 30వ, 9వ వార్డులో సర్వేయర్లు చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. సానిటరి ఎస్సై గజనాంద్, వార్డు అధికారులు, సర్వేయర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



రుద్రూర్: చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. పోతంగల్ మండలం కారేగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం కొలంబస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నల్ల బ్యాడ్జీలతో టీచర్ల నిరసన



రుద్రూర్: కోటగిరి ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ ఉపాధ్యాయులు సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ హైస్కూల్ హెచ్‌ఎం రాములుపై జరిగిన దాడిని వారు ఖండించారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, ఎంఈవో శ్రీనివాస్ రావ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన బస్టాండ్ నిర్మించాలి



బోధన్: కొత్తగా ఏర్పాటైనా పోతంగల్ మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్టాండ్ భవనం నిర్మించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, నాయకులు బోధన్ ఆర్టీసీ డీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందించారు. పోతంగల్, మోస్రా మండలాల కన్వీనర్లు పట్నం రాములు, మేకల మల్లేష్, నాయకులు మహమ్మద్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు పత్రాల అందజేత

ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గం బూత్ కమిటీలను, క్రియశీల సభ్యత్వ నమోదు పత్రాలను జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, బీజేపీ నియెజవర్గ ఇన్‌చార్జి పాలేపురాజు అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారికి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, జిల్లా ఎన్నికల అధికారి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యాదర్శి పల్లె గంగారెడ్డి హాజరవ్వడంతో వారికి పత్రాలను అందజేశారు.

వాహనాల తనిఖీ

రుద్రూర్: మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, వావాహనాల ఇన్సూరెన్స్ తదితర పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేనివారికి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

సేంద్రియ సాగుకు రైతులను ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసే దిశగా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం స్పిక్ ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో డీలర్లకు సేంద్రియ ఎరువుల వాడకంలో ఉపయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మార్క్‌ఫెడ్ చైర్మన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. సేంద్రియ ఎరువులు వాడితే నేలలో సారం పెరిగి పంటలు బాగా పండుతాయన్నారు. కాబట్టి రైతులను ఆర్గానిక్ సాగు వైపు మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం మహేశ్, స్పిక్ ఎరువుల కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



బోధన్: పట్టణంలో సోమవారం స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (ఎస్‌టీయూ టీఎస్) క్యాలెండర్లను సబ్ కలెక్టర్ వికాస్ మహతో, యూనియన్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. యూనియన్ అర్బన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సలీం, కిషోర్, ప్రతినిధులు బాలచంద్రం, సుధాకర్ రెడ్డి, వహెద్, సంజీవ్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..



కమ్మర్‌పల్లి: మండలకేంద్రంలో సోమవారం మండల పద్మశాలీ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మండలాధ్యక్షుడు చితం తిరుపతి, ఉపాధ్యక్షుడు రాజుల కృష్ణ, మురళి, ధరణి, పిల్లమారి సుధాకర్, చింత హన్మంతు, హన్మంతు, అడిచెర్ల రాజు, గంగాప్రసాద్, గుడ్ల నవీన్, నరేష్, ఉదయ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్

- బెదిరింపులు, రాజీ, బేరసారాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలసీ
- బీసీల గురించి ఎమ్మెల్సీ కవిత మాట్లాడటం హాస్యాస్పదం
- బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

సుభాష్‌నగర్: రాష్ట్రంలో ఓవైపు సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుండగా, మరోవైపు తాము న్నామని తెలిసేందుకు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఇష్టానుసారంగా మాట్లాడుతూ ఉనికి కోసం పాకులాడుతున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారితో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎం అయినా.. బ్లాక్‌మెయిల్, రియల్ దందా నుంచి ఇంకా బయటికి రావడంలేదని విమర్శించారు. బెదిరింపులకు పాల్పడడం, ఆ తరువాత బేరసారాలకు దిగడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. సీఎం సీటు కోసం సోనియా, కేంద్ర పార్టీలకు కప్పం కడుతున్నారన్నారు. ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.30వేల కోట్లు అప్పు చేసిందని, అప్పుల కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆరోపించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణంపై కాంగ్రెస్ రాజకీయం తగదని హితవు పలికారు. పీవీని అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీలను పట్టించుకోని బీఆర్ఎస్, కవిత ఇప్పుడు కపట ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. అధికారం కోల్పోయిన తరువాత మహిళలు, బీసీల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహిళ అయి ఉండి కవిత లిక్కర్‌కేసులో జైలుకెళ్లడం సిగ్గుచేటని, ఆమె ఏం చేశారని ఘనస్వాగతం పలికారని ప్రశ్నించారు.

త్వరలో మండల, జిల్లా కమిటీలు

బీజేపీ మండల, జిల్లా కమిటీలను త్వరలోనే నియమిస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు. బూత్ కమిటీ ఎన్నిక ప్రక్రియ పూర్తి కావొచ్చిందని, జనవరి మొదటివారంలో మండల కమిటీ పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాత జిల్లా అధ్యక్ష పదవికి రాష్ట్ర కమిటీ షెడ్యూల్ ఇస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకులు న్యాలం రాజు, అడ్లూరి శ్రీనివాస్, ఆయా మండలాల అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి



సుభాష్‌నగర్: ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని, దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్న సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రశంసనీయమని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సోమవారం మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర అధ్యక్షుడు మార గంగారెడ్డి, డైరెక్టర్లు గోర్కంటి లింగన్న, శరత్, సాయన్న, శేఖర్‌రెడ్డి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలకు పరుగు పోటీలు

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ వద్దగల శ్రీచంద్రటెక్నో పాఠశాలలో సోమవారం తెలంగాణ రికగ్నైజ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ మాక్లూర్, ఆలూర్ మండలాల సంయుక్త ఆధ్వర్యలో అండర్ 14 బాలబాలికల విభాగంలో పరుగుపందెం పోటీలు ప్రారంభం అయ్యాయి. కార్యక్రమానికి ఆలూర్ ఎంఈవో నరేంధర్, ట్రస్మ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం ముఖ్యఅతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. విజేతలకు మాక్లూర్ ఎంఈవో సత్యనారాయణ, ఎస్సై రాజశేఖర్ బహుమతులు అందజేశారు. శ్రీనివాస్, గంగాధర్‌గౌడ్, సుమలత, బాబురావు, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్..

ఒకరికి ఒక రోజు జైలు

బోధన్‌టౌన్(బోధన్): నిబంధనలు పాటించకుండా అర్ధరాత్రి వరకు హోటల్ తెరిచి ఉంచిన వ్యక్తికి ఒక రోజు జైలు శిక్షను విధిస్తు సోమవారం సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శేషసాయితల్ప తీర్పును వెల్లడించారు. పట్టణంలోని గోషాలకు చెందిన చాంద్ పాషా ఈ నెల 27న అర్ధరాత్రి వరకు హోటల్ తెరిచి ఉంచడంతో అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. జడ్జి జైలు శిక్షను విధిస్తు తీర్పునిచ్చారన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట–ఎడపల్లి గ్రామాల్లో ఎడపల్లి పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా ఐదుగురు మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించారు. దీంతో వారిపై కేసు నమోదుచేసి మంగళవారం కోర్టులో హాజరుపరుచనున్నట్లు ఎస్సై వంశీధర్‌రెడ్డి తెలిపారు.

చారిత్రక కట్టడంపై వస్త్రం కప్పిన చిత్రం వైరల్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని చారిత్రక కట్టడంపై ఓ గుర్తు తెలియనివ్యక్తి ఓ వస్త్రం కప్పిన ఫోటో సోమవారం రాత్రి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో కొందరు వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట నారాయణ, ఆర్‌ఐ వరుణ్‌లు చారిత్రక కట్టడం వద్దకు చేరుకొని పెద్దలతో చర్చించి వస్త్రాన్ని తొలగించారు.

ఆధ్యాత్మికం

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీసేవ చేశారు. భక్తులు తీర్థప్రసాదాలతో అన్నదానం స్వీకరించారు.

ఘనంగా ‘సోమావతి అమావాస్య’



రుద్రూర్: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సోమావతి అమావాస్య సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 26 జంటలతో దంపతులు ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. శివ పార్వతుల కల్యాణం జరిపించి, పంచామృతాలతో అభిషేకం చేశారు. రావిచెట్టు చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. శివ పంచాక్షరీ మంత్రాన్ని పఠించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ముగిసిన సాయి పారాయణం

బాల్కొండ: ముప్కాల్ శివారులోని పడిలేచిన మర్రి చెట్టు ఆవరణలో శివసాయి మందిరం వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాయి పారాయణం సోమవారం ముగిసింది. ఈసందర్భంగా భక్తులు భజన కీర్తనలతో అలరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

వైభవంగా అయ్యప్ప ఆరట్టు



బాల్కొండ: మండల కేంద్రంలో సోమవారం అయ్యప్ప ఆరట్టు ఉత్సవాన్ని స్వాములు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవ మూర్తులను ఊరేగించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం సామూహిక మహా పడిపూజ నిర్వహించనున్నట్లు అయ్యప్ప స్వాములు తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	లీగల్లీ వీర్ (తెలుగు)-11.45 డ్రింకర్ సాయి(తెలుగు)-2.50 బేబీజాన్(హిందీ)-6.00 మాక్స్(తెలుగు)-9.30
స్క్రీన్-2 –	మాక్స్(తెలుగు)-10.40, 1.35 7.15, శ్రీకాకుళం పెర్లాక్ హోమ్స్ (తెలుగు)-4.30, 10.40
స్క్రీన్-3-	బేబీజాన్(హిందీ)-10.00 ముఫాసా(తెలుగు)- 1.30, 4.20 7.10, 10.00
స్క్రీన్-4	పుష్ప-2 (తెలుగు) -10.05, 2.10 6.15, 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మాక్స్ (తెలుగు)-10.40, 1.30 శ్రీకాకుళం పెర్లాక్ హోమ్స్ (తెలుగు) - 4.30, పుష్ప2 -7.00 బేబీజాన్(హిందీ)-10.40
స్క్రీన్-2	బేబీజాన్(హిందీ)-1.00 పుష్ప-2(తెలుగు)-4.00 యుఐ(తెలుగు)-7.40 మాక్స్(తెలుగు)-10.20
స్క్రీన్-3	ముఫాసా(తెలుగు)3డీ-11.00, 5.00 7.30, పుష్ప2-1.20, 10.00

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-11.10, 3.15 మాక్స్(తెలుగు)-7.20 ముఫాసా(3డీ ఇంగ్లీష్)-10.15
స్క్రీన్-2	ముఫాసా(3డీ తెలుగు)-10.30, 1.20 7.30, బరోజ్-3డీ(తెలుగు) - 4.10 పుష్ప-2 (హిందీ)- 10.20
స్క్రీన్-3	బేబీజాన్(హిందీ)-11.00, 10.40 పుష్ప-2(హిందీ)-2.30, 6.35
స్క్రీన్ -4	మాక్స్(తెలుగు)-10.30, 10.50 డ్రింకర్ సాయి(తెలుగు)-1.25 శ్రీకాకుళం పెర్లాక్ హోమ్స్ (తెలుగు)-4.35, బేబీజాన్(హిందీ)-7.20
లలితామహల్	యుఐ(తెలుగు)-11.15, 2.15 విడుదల2(తెలుగు)-6.15,9.15
దేవి	ముఫాసా(2డీ తెలుగు)-11.00, 2.15 6.10 10.10
నటరాజ్	మాక్స్(తెలుగు)-11.00, 2.15, 6.10 10.10
విజయ్	పుష్ప2 -10.30 2.15 6.10 10.05

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,300	వెండి(కిలో)	93,500
22 క్యారెట్స్	73,800		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

సంక్షిప్తం

బీమా చెక్కు అందజేత

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నూత్‌పల్లి గ్రామానికి చెందిన రైతు లోక మహిపాల్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు.అతడికి డొంకేశ్వర్ సొసైటీలో రూ.1లక్ష ప్రమాద బీమా ఉండగా, సోమవారం బాధిత కుటుంబానికి సంబంధిత చెక్కును సొసైటీ చైర్మన్ భరత్‌రాజ్‌రెడ్డి అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రానికి చెందిన ఓ బాధిత కుటుంబానికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమావారం స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. మంద మహిపాల్, గంగాధర్, జమిల్, దమ్మాయి శ్రీను, ఖదీర్, భూమేష్, పోశెట్టి, శ్రీనివాస్, లింగం, నవాబ్, రహీమ్, ఎడ్డిగారి నిఖిల్, నాగరాజ్, అక్బర్ పాల్గొన్నారు.

రోటరీ సాంస్కృతిక పోటీలు

మాక్లూర్: మండలంలోని గుత్ప గ్రామంలో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. రోటరీ క్లబ్ పూర్వ గవర్నర్ హరిస్మరన్‌రెడ్డి, క్లబ్ ప్రతినిధులు పద్మ శ్రీనివాస్, రాచకొండ గౌరీశంకర్, బంగారి వీరబ్రహ్మం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గౌరైపాటి మాధవరావు మృతికి సంతాపం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది గౌరైపాటి మధావరావు మృతి పట్ల సంతాపం ప్రకటించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, న్యాయవాదులు భూపతిరెడ్డి, సదానందం, గంగారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డ, కృష్ణంరాజు, రమేష్, షిండే, సుకేష్, రాములు, అజిత్, గణేష్, కిరణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి సన్మానం

వేల్పూర్: మండలంలో పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సోమవారం వేల్పూర్‌లో సన్మానం నిర్వహించారు. భీమ్‌గల్ ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉషారాణి, గంగహసం, జిల్లా సీఐటీయు అధ్యక్షురాలు దేవగంగు, పచ్చలనడ్కుడ సెక్టార్ లీడర్ స్వరూప, మండల అంగన్‌వాడీ అసోసియేషన్ అధ్యక్షురాలు వసంత, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఎస్సైకి..

వేల్పూర్: మండలానికి నూతనంగా నియమితులైన ఎస్సై సంజీవ్‌ను సోమవారం మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు ప్రతాప్‌రెడ్డి, పిట్లసత్యం, మొండి మహేశ్, మందాజి దయాకర్, సుంకరి రాము, గుజరాతి అశోక్, నహీమ్ పాల్గొన్నారు.

పట్వారీ తులసికి..

ఆర్మూర్‌టౌన్: పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు పట్వారి తులసి సోమవారం పుడమి సాహితీ వేదిక వారి పుడమిరత్న జాతీయ విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు అనిఫ్, వినోద్‌లు పట్వారి తులసిని ఘనంగా సన్మానించారు.

వాహనాలకు వేలం

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లి గ్రామంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం నాలుగు వాహనాలకు వేలంపాట నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ స్టీవేన్‌సన్ తెలిపారు. మొత్తం నాలుగు వాహనాలకు గాను రెండు వాహనాలకు వేలం జరిగిందని, మిగితా రెండు వాహనాలకు త్వరలో వేలం నిర్వహిస్తామని ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు.